## క్లుప్తంగా

### వైభవంగా సుబ్రమణ్యస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు

**వేంపల్లె :** స్థానిక గాండ్ల వీధిలో వెలసిన శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగింది. గురువారం సుబ్రమణ్య షష్టిని పురస్కరించుకుని వేంపల్లెలోని పురవీధుల గుండా స్వామివారిని తాళా మేళాల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు శేషగిరిరావు, హరి ప్రవీణ్‌ల నేతృత్వంలో భక్తుల సహకారంతో సుబ్రమణ్య స్వామికి అభిషేకంతోపాటు షష్టి పూజాది కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో స్వామివారి ప్రాకారోత్సవం నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు

**చక్రాయపేట :** మండలంలోని చెరుకాంపల్లెలో గురువారం ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ప్రతి ఇంటికి వెళ్లి రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్‌కు సంబంధించిన నియమాలు, అవయవదానం చేయడంవలన కలిగే ప్రయోజనాలు, స్త్రీ సాధికారత గురించి గ్రామస్తులకు తెలియజేశారు. వేగం కన్నా ప్రాణం మిన్న, హెల్మెట్ ధరించండి ప్రాణాలను రక్షించండి, అవయవదానం–మహా దానం అనే నినాదాలతో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### కంపచెట్లు తొలగింపు



జేసీబీతో కంపచెట్లను తొలగిస్తున్న దృశ్యం

**కమలాపురం :** మండలంలోని పాచికలపాడు, కుప్పూరువారిపల్లె గ్రామాల్లో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సొంత నిధులతో రెండు జేసీబీలు ఏర్పాటు చేసి కంపచెట్లు తొలగించారు. గురువారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు కూప్పూరు మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో రెండు జేసీబీలతో కంపచెట్లను తొలగించారు. ఆయా గ్రామాల్లో ని ప్రధాన రహదారులతో పాటు పంట పొలాలకు వెళ్లే దారుల్లో ఉన్న కంపచెట్లన్నీ తొలగించారు. దీంతో గ్రామ ప్రజలు ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలియజేశారు.

### రావులకొలను ఉన్నత పాఠశాల తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని తింటున్న జెడ్పీటీసీ ఝాన్సీరాణి

**సింహాద్రిపురం :** మండలంలోని రావులకొలను ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం జెడ్పీటీసీ ఝాన్సీరాణి ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల విద్యా సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు పాఠశాలను తనిఖీ చేయడం జరిగిందని.. ఇక్కడ ఉపాధ్యాయుల పనితీరు బాగుందని.. విద్యార్థులు బాగా చదువుకుంటున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కింద అందించే భోజనాన్ని పరిశీలించి భుజించి వంటకాలు బాగున్నాయని కితాబునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు.

### నేటి నుంచి నీటి సరఫరా నిలిపివేత

**పులివెందుల టౌన్ :** స్థానిక పెద్దకొండప్ప కాలనీ, భాకరాపురం, గుంతబజార్, సియోన్‌పురం, ఎస్‌బీఐ కాలనీ, నగరిగుట్ట, మైత్రి లేఔట్, రాజీవ్ కాలనీ, వైఎస్సార్ కాలనీ, రాజారెడ్డి కాలనీలలో శుక్ర, శనివారాలలో నీటి సరఫరాకు నిలిపి వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నీటి సరఫరా చేసే ట్యాంక్‌ను శుభ్రం చేస్తుండటంతో నీటి సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు. ఈ విషయాన్ని ఆయా ప్రాంతాల ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు. అత్యవసర నీటి సరఫరా కొరకు 8885105246 అనే ఫోన్ నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

# అందరం కలిసికట్టుగా పనిచేయాలి

- వైఎస్ జగన్, అవినాష్‌లను అఖండ మెజార్టీతో గెలిపిద్దాం
- ఆకట్టుకున్న మోటివేటర్ చిరంజీవి ప్రసంగం



ఆత్మీయ సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



వైఎస్సార్‌సీపీ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, తదితరులు

**పులివెందుల :** రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలను అఖండ మెజార్టీతో గెలిపించుకునేందుకు అందరం కలిసికట్టుగా పనిచేయాలని పులివెందుల మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న వైఎస్సార్ ఆడిటోరియంలో మున్సిపాలిటీ పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలను ప్రవేశపెట్టి జనరంజక పాలన అందిస్తున్నారన్నారు. ముఖ్యంగా పులివెందుల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలు ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోవడం ద్వారా ఇటు పులివెందుల అభివృద్ధే కాక, రాష్ట్ర అభివృద్ధికి కూడా సహకరించేందుకు పులివెందుల నుంచే నాంది పలకాలన్నారు. పులివెందుల ప్రాంతంలో సాఫ్ట్‌వేర్ కంపెనీతోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఏర్పాటు చేసేందుకు కృషి చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఎలాంటి తారతమ్యాలు లేకుండా రాబోయే ఎన్నికల్లో కార్యకర్త స్థాయి నుంచి నాయకుడి వరకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. అనంతరం తెలంగాణా ప్రాంతం నుంచి మోటివేటర్ చిరంజీవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగం ఆకట్టుకుంది.

కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ రుక్మిణీదేవి, జేసీఎస్ కన్వీనర్లు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళి, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శైలజ, అటవీ శాఖ డైరెక్టర్ సైరా భాను, నెడ్‌క్యాప్ కార్పొరేషన్ డైరెక్టర్ రాజేశ్వరి, గిడ్డంగుల కార్పొరేషన్ డైరెక్టర్ చంద్ర కళావతి, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్ జగన్ మళ్లీ ప్రమాణస్వీకారం చేస్తారు



తెలంగాణా ఎన్నికల్లో అనుకున్న ఫలితాలు రాలేదని.. కానీ ఆంధ్రప్రదేశ్‌లో అలాంటి ఫలితాలు రాకుండా మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. గడిచిన ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అనేకమంది అనేక రకాలుగా పలు విమర్శలు చేసి, ఎన్ని కుట్రలు చేసినా కేవలం ప్రజలకు సేవ చేసేందుకే ఆయన అన్ని ఆటుపోట్లను తట్టుకున్నారన్నారు.

– చిరంజీవి(మోటివేటర్), హైదరాబాద్

### వైఎస్ కుటుంబం రుణం తీర్చుకుందాం..



పులివెందుల ప్రాంతానికి గత 40 ఏళ్లుగా వైఎస్ కుటుంబం చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. వచ్చే ఎన్నికలలో అందరం సమష్టిగా వైఎస్ జగన్, వైఎస్ అవినాష్‌లను అఖండ మెజార్టీతో గెలిపించి వైఎస్ కుటుంబ రుణాన్ని తీర్చుకుందాం.

– చిన్నప్ప(మార్కెట్ యార్డు చైర్మన్), పులివెందుల

### పులివెందులలో సత్తా చాటాలి..



వచ్చే ఎన్నికలలో పులివెందులలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని లక్ష ఓట్లకుపైగా మెజార్టీతో గెలిపించడం ద్వారా పులివెందుల సత్తాను రాష్ట్ర వ్యాప్తంగా చాటి చెప్పాలన్నారు. ఈ సందర్భంగా నారాయణస్వామి వైఎస్ భాస్కర్‌రెడ్డిపైన తాను స్వయంగా రాసిన పాటను సభలో పాడి వినిపించారు.

– నారాయణస్వామి(రాష్ట్ర అటవీ శాఖ డైరెక్టర్), పులివెందుల

### సింహం సింగిల్‌గా వస్తుంది



సింహం సింగిల్‌గా వస్తుందని.. పందులే గుంపులుగా వస్తాయన్నారు. రాబోయే ఎన్నికలలో కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కడే ఒకవైపు, దుష్టచతుష్టయమంతా మరోవైపు రానుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డికి దేవుడి దయ, ప్రజల మద్దతు అనే బలమైన ఆయుధాలు ఉన్నాయన్నారు.

– వరప్రసాద్(మున్సిపల్ చైర్మన్), పులివెందుల

### సిద్ధం సభను జయప్రదం చేద్దాం..



ఈనెల 18వ తేదీన ఆదివారం అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభకు పులివెందుల నుంచి పెద్ద ఎత్తున తరలి వెళ్లి సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సిద్ధం సభకు ప్రతి కార్యకర్త, ప్రతి అభిమాని, నాయకులు తరలి రావాలన్నారు.

– హాలు గంగాధరరెడ్డి(సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్), పులివెందుల

### మైనార్టీలు అండగా ఉంటాం..



వచ్చే ఎన్నికలలో పులివెందుల నియోజకవర్గంలోని ముస్లిం మైనార్టీలందరం వైఎస్ కుటుంబానికి అండగా ఉంటాం. రాబోయే రెండు నెలలు అందరూ సమష్టిగా కులమతాలకతీతంగా పార్టీ అఖండ విజయానికి కృషి చేద్దాం.

– రసూల్ సాహెబ్(దూదేకుల కార్పొరేషన్ సంస్థ చైర్మన్), పులివెందుల

## నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

**పులివెందుల :** పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మ వ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బొదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పొక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సబ్యం (శోభి), మాగురు (మంగు), అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ, మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వడ్లతల ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణభేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తల నొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

## సిద్ధం బహిరంగ సభకు తరలి రావాలి



మాట్లాడుతున్న మండల కన్వీనర్ చంద్రఓబుళరెడ్డి

**వేంపల్లె :** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదింటి భవిష్యత్‌ను మరింత గొప్పగా మార్చే పరిపాలన అందించేందుకు మన వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించేందుకు సిద్ధం పేరుతో బహిరంగ సభలకు శ్రీకారం చుట్టారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్ర ఓబుళరెడ్డి తెలిపారు. ఈనెల 18వ తేదీన అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగే సిద్ధం బహిరంగ సభకు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జేసీఎస్ కన్వీనర్ ఆర్.శ్రీనివాసులు, ఎంపీపీ ఎన్.లక్ష్మీగాయత్రిలతో కలిసి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, నేతలు, కార్యకర్తలు, అభిమానులతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించి మాట్లాడారు. గడిచిన 5 ఏళ్ల పాలనలో సీఎం జగన్ అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి విశేష కృషి చేశారన్నారు. అర్హతే ప్రామాణికంగా నవరత్నాల సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపినట్లు వెల్లడించారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నను సీఎం చేసుకోవాలని.. అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగే సిద్ధం భారీ బహిరంగ సభలో మండల వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని సిద్ధం సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ షబ్బీర్‌వలి, వైఎస్సార్ సీపీ యూత్ కన్వీనర్ రవిశంకర్‌గౌడ్, వైఎస్సార్‌సీపీ నాయకులు, శ్రేణులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న కమిషనర్ రాముడు


**కమలాపురం :** ప్రజా సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని, తక్షణం స్పందించి సమస్యలను పరిష్కరించాలని కమలాపురం మున్సిపల్ చైర్మన్ మార్పురి మేరి తెలిపారు. గురువారం నగర కమిషనర్ రాముడు అధ్యక్షత కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. అర్బన్ హెల్త్ సెంటర్ అభివృద్ధి పనులు, సీసీ రోడ్లు, డ్రైన్స్, మంచినీటి సరఫరా తదితర 12 అంశాలను కౌన్సిల్‌లో ఆమోదం తెలిపారు. కాగా ప్రజల సమస్యల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించకుండా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ముఖ్యంగా వేసవి కాలం ప్రారంభమైందని, తాగునీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పలువురు కౌన్సిల్ సభ్యులు అడిగిన సీసీ రోడ్లు, తాగునీరు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరడంపై స్పందించిన చైర్మన్ ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. కేవలం ప్రజల సమస్యల పరిష్కారం కోసమే సీఎం జగనన్న సచివాలయ, వలంటీర్ వ్యవస్థ తీసుకు వచ్చారన్నారు. మనం కూడా వారికి చేయూత నందించి ప్రజా సమస్యలు పరిష్కరించడంలో తమ వంతు కృషి చేయాలన్నారు. కమిషనర్ రాముడు మాట్లాడుతూ మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులకు దాదాపు రూ.93 కోట్లు మంజూరయ్యాయన్నారు. తాగునీరు, రోడ్డు వైండనింగ్, బ్యూటిఫికేషన్, ఆర్చి తదితర నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. సీనియర్ అసిస్టెంట్ రాము 12 అంశాలను చదివి వినిపించగా చైర్మన్ ఆమోదం తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి


**చింతకొమ్మదిన్నె :** మండలంలోని ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యమని జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎస్.రమణ తెలిపారు. గురువారం మండలంలోని 33/11 సబ్‌స్టేషన్ తదితర ప్రాంతాలలో లైన్లను, ట్రాన్స్‌ఫార్మర్లను ఆయన పరిశీలించారు. అనంతరం విద్యుత్ ఉద్యోగులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉద్యోగులు నిర్లక్ష్యంగా లేకుండా విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేయాలన్నారు. ప్రజలకు నాణ్యమైన నిరంతరం విద్యుత్‌ను అందించాలన్నారు. వ్యవసాయ పొలాలకు అధిక వోల్టేజ్ విద్యుత్ ద్వారా విద్యుత్ కంచెను ఏర్పాటు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. తద్వారా అంతరాయాలు ఏర్పడటమే కాకుండా విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తాయని ప్రజలను చైతన్యవంతులను చేసి విద్యుత్ కంచెలను నిర్మూలించాలని ఆదేశించారు. వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలన్నారు. పలుమార్లు సూచనలు చేస్తున్నా పగటి పూట వీధిలైట్లు వెలుగుతూనే ఉన్నాయన్నారు. రానున్న పది, ఇంటర్ పరీక్షలను దృష్టిలో ఉంచుకుని పరీక్షా కేంద్రాల వద్ద ముందస్తుగా అంతరాయాలు లేని నిరంతర విద్యుత్ అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కడప సబ్ డివిజన్ డీఈఈ కృష్ణదేవ, ఏఈలు రమణ, వేణుగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## నేటి నుంచి శ్రీవేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు

- విద్యుత్ దీప కాంతులతో ఆలయానికి కొత్త శోభ
- 24న బ్రహ్మ రథోత్సవం



పూజలందుకోనున్న సతీసమేత శ్రీ వెంకటరమణుడు



విద్యుత్ దీపకాంతులతో వేంకటరమణస్వామి ఆలయ రాజగోపురం

**పులివెందుల టౌన్ :** పులివెందులలోని పాత బస్టాండు సమీపంలో వెలసిన శ్రీ వేంకటరమణుడి ఆలయంలో రథసప్తమిని పురస్కరించుకుని శుక్రవారం నుంచి 27వ తేదీ వరకు పద్మావతి సమేత శ్రీ కల్యాణ వెంకటరమణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఏర్పాట్లను పూర్తి చేసేవిధంగా ఆలయ చైర్మన్ వైఎస్ మనోహర్‌రెడ్డి ఆలయ కమిటీకి సూచించారు. శుక్రవారం రథసప్తమిని పురస్కరించుకుని తొలి రోజు బ్రహ్మోత్సవాలను అంకురార్పణతో ప్రారంభించి స్వామివారిని కొలువుతీర్చి సేనాధిపతి ఉత్సవం నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు వరదాచార్యులు తెలిపారు. తెల్లవారు జామున సూర్యప్రభ వాహనంపై బయలుదేరి స్థానిక పూలంగళ్ల వద్ద సూర్య కిరణాలు పడేవరకు ఉండి అక్కడే ప్రత్యేక పూజలు అందుకోనున్నారు. అనంతరం గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. అదేవిధంగా స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారని తెలిపారు. 17వ తేదీన ఉదయం ధ్వజారోహణం, సుప్రభాత సేవ, తోమాలసేవ, సాయంత్రం సహస్ర దీపాలంకరణ ఊంజల సేవ అనంతరం పెద్ద శేష వాహనంపై స్వామివారికి కొలువుతీర్చి గ్రామోత్సవం నిర్వహిస్తారు. అలాగే ప్రతిరోజు ఉదయం నుంచి జరిగే వివిధ కార్యక్రమాలతో పాటు ప్రతి రోజు సాయంత్రం సహస్ర దీపాలంకరణ ఊంజలసేవ అనంతరం ఉభయదారులతో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తారు. 27వ తేదీ ఉదయం శ్రీవారి కళ్యాణంతోపాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. భక్తాదులకు వివిధ రూపాల అలంకారంలో స్వామివారు దర్శనమివ్వనున్నారు. భక్తులు దేవ దేవుడిని దర్శించి తరించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

### నేడు బీఆర్ కొట్టాలలో గడప గడపకు మన ప్రభుత్వం

**జమ్మలమడుగు :** మండలంలోని బొమ్మెపల్లి పంచాయతీ పరిధి బీఆర్ కొట్టాలలో శుక్రవారం సాయంత్రం నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పాల్గొంటారని సర్పంచ్ రామనాథ్‌రెడ్డి తెలిపారు. కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

### నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

**లింగాల :** మండలంలోని కామసముద్రం గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తేజోజ్యోష్ణ తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలకు వైద్యాధికారులు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేస్తారని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని సచివాలయ పరిధిలో ని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

### రక్తదానం



రక్తదానం చేస్తున్న కళాశాల అధ్యాపకులు

**కడప ఎడ్యుకేషన్:** మనం చేసే రక్తదానం అత్యవసర సమయాల్లో మరొకరికి ప్రాణదానం అవుతుందని ఎర్రగుంట్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్ అన్నారు. గురువారం కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ పీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఈ రక్తదానం శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదానం శిబిరంలో పొద్దుటూరుకు చెందిన ప్రభుత్వ హాస్పిటల్ రక్తనిధి కేంద్రానికి సంబంధించిన అధికారులు, విద్యార్థుల తోపాటు పలువురు అధ్యాపకులు రక్తదానం చేశారు. వైస్ ప్రిన్సిపాల్ ఈశ్వర్‌రెడ్డి, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత.. అందరి బాధ్యత



కమలాపురంలో రోడ్డు భద్రతా నియమాలకు సంబంధించిన ఛాయా చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

**కమలాపురం :** రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, ఇది అందరి బాధ్యత అని సీవీ రామన్ సైన్స్ క్లబ్ కడప డివిజన్ అధ్యక్షుడు రామిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. 35వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాన్ని పురస్కరించుకుని జన విజ్ఞాన వేదిక, సీవీ రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రోడ్డు భద్రత, రోడ్డు ప్రమాదాలు జరిగేటటువంటి ఛాయా చిత్రాల ప్రదర్శన చేశారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ వాహనాలు నడిపితే సురక్షితంగా గమ్యం చేరుకోవచ్చన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపవద్దన్నారు. అనంతరం విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం కే బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన**

**పులివెందుల రూరల్ :** రోడ్డు భద్రత నివారణకు ప్రతి ఒక్కరు బాధ్యతగా పనిచేయాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బీవీ ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక ఎంవీఐ కార్యాలయంలో ఆర్టీసీ, ఆటో డ్రైవర్లకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు ప్రయాణం చేసేటప్పుడు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చునన్నారు. ప్రతి వాహనదారుడు హెల్మెట్ ధరించాలన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ఏదైనా ప్రమాదం జరిగితే తమ కుటుంబాలు చిన్నాభిన్నమవుతాయన్నారు. అందువల్ల అధికారులు చెప్పే సలహాలు, సూచనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం రామకృష్ణ, ఆర్టీసీ యూనియన్ నాయకులు, సిబ్బంది, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

## నీటిసమస్య లేకుండా చేయాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ

**జమ్మలమడుగు :** వేసవి కాలం వస్తుండటంతో స్థానిక అంబవరం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలలో తాగునీటి సమస్య లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ తెలిపారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అధికారులు వీధుల్లో వీధి దీపాలు, పారిశుద్ధ్య చర్యలతోపాటు కాలువల నిర్మాణాలు చేపట్టాలన్నారు. తాగునీటి సమస్య ఎక్కడున్నా వెంటనే ప్రజలకు తాగునీటిని సరఫరా చేయాలన్నారు. ప్రస్తుతం సరైన వర్షాలు లేనికారణంగా భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. మరో మూడు నెలల పాటు పెన్నానదిలో బోర్లు పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలన్నారు. ప్రస్తుతం జగనన్నకాలనీలో తాగునీటి సమస్య తీవ్రంగా ఎర్పడింది. ఆసమస్యలను తీర్చటానికి కౌన్సిల్ సమావేశంలో చర్చించి రెండు బోర్లను ఏర్పాటు చేయడం కోసం రూ.2 లక్షలు కేటాయించాలని అధికారులకు తెలిపామన్నారు. కౌన్సిలర్లు ఎటువంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకుని వస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, వైస్ చైర్మన్లు రామలక్షుమ్మ, సింగరయ్య పాల్గొన్నారు.

### కనీస వేతనాలు అమలుచేయాలి

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గురువారం ఆర్టీసీ వర్క్‌షాప్ మేనేజర్ రహమతుల్లాకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సర్క్యులర్ ప్రకారం కాంట్రాక్టర్ జీతాలు చెల్లించడం లేదన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ అకౌంట్ కార్మికుల ఖాతాల్లో జమ కావడం లేదన్నారు. ఈఎస్ఐలో కుటుంబ సభ్యులను చేర్చకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు పాల్గొన్నారు.